
సాక్షి
అనకాపల్లి
గురువారం । 11 । జనవరి । 2024



వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.

ఘనంగా విశేష పూజలు



విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు.



పోటెత్తిన భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే బారులు తీరారు.

అధినేత దెబ్బ.. అయ్యన్న అబ్బా..

- కుమారుడికి అనకాపల్లి ఎంపీ టికెట్ హుళక్కే..
- నర్సీపట్నానికే పరిమితమంటున్న బాబు
- ఈ సీటు కొడుక్కే ఇవ్వాలంటూ ఇంటి పోరు
- ఇప్పుడు బరిలోకి దింపకపోతే రాజకీయ వారసత్వం కష్టమేనని భావన
- ఇంటి పోరుతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో అయ్యన్న
- అధినేత తీరుపై అసహనంతో రగిలిపోతున్న వైనం

టీడీపీ సీట్ల చిత్రాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఒకవైపు అధినేత అనకాపల్లి ఎంపీ సీటు విషయంలో కొట్టిన దెబ్బకు కోలుకోలేక మధనపడుతున్న అయ్యన్నకు.. ఇంటి పోరు మరింత తలపోటుగా మారుతున్నట్టు తెలుస్తోంది. రాజకీయ వారసత్వంగా కొడుకును నర్సీపట్నం నుంచి 2024 ఎన్నికల్లో బరిలోకి దించాలంటూ ఒత్తిడి అధికం కావడంతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో ఒకవేళ రానున్న ఎన్నికల్లో కొడుకును బరిలోకి దించకపోతే తన రాజకీయ వారసత్వం కష్టమనే భావనలో అయ్యన్న ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే ఇక అయ్యన్న నోటికి తాళం పడినట్టేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి కుమారుడికి అనకాపల్లి ఎంపీ సీటు కోసం అయ్యన్న తీవ్రంగా కష్టపడ్డారు. నోటికి వచ్చినట్టు ఇష్టారీతిన అధికార వైఎస్సార్ సీపీపై విమర్శలు గుప్పించారు. అధినేత దృష్టిలో ఉంటూ అనకాపల్లి ఎంపీ సీటును కొడుకుకు వచ్చేలా యత్నించారు. అయితే, ఎన్నికలు వచ్చేసరికి వ్యాపారవేత్తలు, ఫైనలు ఉన్నవారికే సీటు ఇచ్చే అలవాటున్న చంద్రబాబు ఈసారి మారారనే భావనలో అయ్యన్న ఉన్నారు. తీరా ఎన్నికల ముంగిటకు వచ్చేసరికి యథావిధిగా అనకాపల్లి ఎంపీ సీటును బాగా ఖర్చు చేయగలిగిన వ్యక్తికి ఇవ్వనున్నట్టు సంకేతాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే రాజకీయ వారసత్వం కోసం నర్సీపట్నం నుంచి కొడుకును బరిలోకి దించాలంటూ ఇంటి పోరు రోజురోజుకీ ఎక్కువవుతున్నట్టు తెలుస్తోంది.



కొడుకు పోరుతో విలవిల

వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వకపోతే కుమారుడిని నర్సీపట్నం నుంచి బరిలోకి దించాలంటూ ఇంటి పోరు అధికమైనట్టు తెలుస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో నోటికి వచ్చినట్టు ఇష్టానుసారంగా మాట్లాడిన అయ్యన్న ఓటమి తర్వాతైనా గుణపాఠం నేర్చుకుంటారని అందరూ భావించారు. అయితే, అయ్యన్న బుద్ధి మాత్రం మారలేదు. సరికదా ఓటమి బాధలో మరింతగా దిగజారి మాట్లాడటం ప్రారంభించారు. ఫలితంగా నియోజకవర్గంలో అయ్యన్నకు ఏ మాత్రమూ పట్టుపెరగడం లేదు. మరోవైపు ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ వివాదరహితుడు కావడం... తాజాగా జరిగిన సాధికార యాత్ర విజయవంతం కావడం వల్ల మరోసారి వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కచ్చితంగా 2024 ఎన్నికల్లోనే కుమారుడిని బరిలోకి నిలిపేలా ఇంటి పోరు ఎక్కువవుతోందని సమాచారం. 2029 ఎన్నికల వరకూ వేచిచూడటం కష్టమంటూ కుమారుడికి మద్దతుగా అయ్యన్న సతీమణి కూడా గొంతు కలుపుతున్నట్టు తెలుస్తోంది. ఫలితంగా అధినేత వైఖరితో తలబొప్పి కట్టిన అయ్యన్నకు... ఇంటి పోరు మరింత తలపోటుగా మారింది. కొడుకును బరిలోకి దింపి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించుకుంటారా లేదా అనేది త్వరలో తేలనుంది.

రాజకీయ వారసత్వం కష్టమే..

వాస్తవానికి ఏ రాజకీయ నాయకుడైనా తనకు ఆరోగ్యం, వయస్సు సహకరించిన సమయంలోనే తన వారసత్వాన్ని రాజకీయాల్లో దించటం సహజ పరిణామం. తీరా వయస్సు అయిపోయిన తర్వాత వారసత్వాన్ని రంగంలోకి దించితే గెలిపించడం కష్టంగా మారుతుంది. ఈ నేపథ్యంలోనే అనేక మంది రాజకీయ నాయకులు తమ వారసులను రంగంలోకి దించే ప్రయత్నం చేస్తారు. అయితే అయ్యన్న నర్సీపట్నంతో పాటు అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వాలని కోరుతున్నారు. చంద్రబాబు మాత్రం ఎప్పటికప్పుడు దీనిపై దాటవేస్తూ వస్తున్నారు. కొద్దిరోజుల ముందు భారీగా ఖర్చు చేసే అభ్యర్థి దొరకడంతో అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వలేమని తేల్చిచెప్పేశారు. దీంతో పార్టీ కోసం కష్టపడితే ఇదేనా నాకిచ్చే గౌరవమంటూ ఆయన లోలోపల మండిపడుతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఇదే పరిస్థితుల్లో నర్సీపట్నం నుంచి తాను రంగంలోకి దిగితే వచ్చే ఎన్నికల వరకు అంటే 2029 వరకూ రాజకీయ వారసత్వం కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈసారి ఎన్నికల్లో గెలిచే సూచనలు కనిపించనప్పటికీ కొడుకును బరిలో నిలపడం ద్వారా రాజకీయ వారసత్వం కొనసాగించే అవకాశం ఉంటుంది.

నేత్రపర్వంగా ధనుర్మాసోత్సవాలు

- నేడు కూడారై ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

కశింకోట: కశింకోటలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం ఉదయం 'కూడారై' ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు తెలిపారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 27వ రోజున గోదాదేవిని వివాహం చేసుకునేందుకు రంగనాథుడు అంగీకారం తెలిపిన రోజును కూడారై ఉత్సవంగా ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బెల్లం, పంచదారతో వేర్వేరుగా పాయసాలు తయారు చేసి స్వామికి నివేదిస్తామన్నారు. ఆలయంలో విష్ణు సహస్ర నామార్చన, తిరుప్పావై, పాశుర విన్నపం పఠనం నిర్వహిస్తామన్నారు. పాయసాన్ని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తామని చెప్పారు.

- ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కూడారై ఉత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు, ఆలయం తరఫున సమర్పించిన 300 కిలోల బియ్యం, డ్రైఫ్రూట్స్‌తో పాయసం తయారు చేసి స్వామికి నివేదిస్తామన్నారు. అనంతరం ఆ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేస్తామని తెలియజేశారు.

న్యూస్‌రీల్

వీకే పీసీపీఐఆర్‌యూడీఏ చైర్మన్‌గా చొక్కాకుల వెంకటరావు



సీతమ్మధార (విశాఖ): విశాఖ–కాకినాడ పెట్రోలియం కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా చొక్కాకుల వెంకటరావును నియమించారు. ఈ మేరకు బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి ఈ సందర్భంగా చొక్కాకుల వెంకట్రావ్ కృతజ్ఞతలు తెలిపారు.

గోవాడ సుగర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సుగర్‌కేన్ కమిషనర్‌తో విప్ ధర్మశ్రీ



రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్‌ను కలిసిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, సుగర్స్ కార్మికులు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర సుగర్‌కేన్ కమిషనర్ వెంకటరావును కోరినట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చెప్పారు. ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ నాయకులతో పాటు విజయవాడలో కమిషనర్‌ను కలిసినట్టు ఆయన తెలిపారు. ఫ్యాక్టరీలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న ఓవర్ పేమెంట్ కార్మికులను రెగ్యులర్‌చేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఈ సందర్భంగా కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చినట్టు ఎమ్మెల్యే ధర్మశ్రీ చెప్పారు. గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.వి.వి. భాస్కరరావు, సర్పంచ్ మూడెడ్ల శంకరరావు, సత్యం తదితరులు ఉన్నారు.

స్కేటర్ సాహితికి రూ.3.85 లక్షల ప్రోత్సాహం



సాహితికి చెక్కు అందిస్తున్న దివీస్ వైస్ ప్రెసిడెంట్ దేవేందర్

తగరపువలస: రోలర్ స్కేటింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న సాహితికి దివీస్ లేబొరేటరీ యాజమాన్యం బుధవారం రూ.3.85 లక్షలు అందించింది. సంస్థ వైస్ ప్రెసిడెంట్ సురెడ్డి దేవేందర్, జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు ఆమెకు ఈ మొత్తం చెక్కును అందించారు. భవిష్యత్‌లో సాహితీ మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. మిగిలిన క్రీడాకారులను కూడా సంస్థ ప్రోత్సహిస్తుందన్నారు. ఎలక్ట్రికల్ విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆలపాటి ఆనంద్, సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, కె.నరసింహ, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగదల్‌పూర్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: కొత్తవలస–కిరండూల్ లైన్ పరిధి దంతేవాడ–కమ్లూర్ సెక్షన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదించినట్టు వాల్తేర్ సీనియర్ డీసీఎం ఎ.కె త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ గురువారం జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది. గురు, శుక్రవారాల్లో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ గురువారం జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది. గురు, శుక్రవారాల్లో కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ జగదల్‌పూర్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట (విశాఖ): జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘాల సమావేశాలు ప్రారంభమవుతాయి. 10 గంటలకు రెండో స్థాయీ సంఘం, 10.30కు 5, 12కు 4, 6, మధ్యాహ్నం 3 గంటలకు 1, 3, 7వ స్థాయీ సంఘం సమావేశాలు జరుగుతాయి. సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు అధికారులను ఆదేశించారు.

ఊరంతా ఉల్లాసం... ఇంటింటా ఆనందం



కొత్త బట్టల కొనుగోళ్లతో హడావిడిగా ఉన్న పల్లె జనం

- సొంతూళ్లకు తరలివస్తున్న వలస జనం
- సందడితో పులకించిపోతున్న పల్లెలు



ఆనందంగా స్వగ్రామాలకు వస్తున్న వలస కూలీలు

చోడవరం: సంక్రాంతి పండగ రావడంతో పల్లెలన్నీ జనంతో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే పాఠశాలలు, కాలేజీలు, ఇతర విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో దూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులంతా తమ స్వగ్రామాలకు వచ్చేశారు. వివిధ పనుల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిన కూలీలు కూడా వారి సొంతూళ్లకు చేరుకుంటున్నారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల మండలాల నుంచి ఏటా వందలాది మంది కూలీలు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా,ఒంగోలు, నెల్లూరు జిల్లాలకు వరి కోతలు, ఇతర కూలి పనులకు వెళ్లి నెలల తరబడి అక్కడే ఉంటారు. మరికొందరు చెన్నై, కోల్‌కత్తా, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు రోజువారీ కూలిపనులకు వెళతారు. వీరంతా పిల్లలను, వృద్ధులను స్వగ్రామాల్లో వదిలేసి ఏడాదంతా అక్కడ పనులు చేసి నగదు సమకూర్చుకుని సంక్రాంతి నాటికి తమ సొంత ఊళ్లకు చేరుకుంటారు. ఎక్కడెక్కడికో జీవనోపాధికోసం వెళ్లిన వారంతా ఇప్పుడు గ్రామాలకు చేరడంతో పల్లెలన్నీ జనంతో ఎంతో సందడిగా ఉన్నాయి.

నెలల తరబడి ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన తమ బిడ్డలు ఇప్పుడు ఇళ్లకు రావడంతో ఆ కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయి. ఏ ఇంటిలో చూసినా ఆనందం తాండవిస్తోంది. ఈ ప్రాంతం వలస కూలీలంతా రైళ్లలో వచ్చి అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో దిగడంతో స్టేషన్ కూడా జనంతో కిటకిటలాడింది. ఇక పరిసర ప్రాంతాలకు వెళ్లే వారితో చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్, ఆటో స్టాండ్‌లన్నీ రద్దీగా ఉన్నాయి. పట్టణాలకు, షాపింగ్ మాల్స్‌కు దూరంగా ఉన్న చిన్న చిన్న పల్లెటూర్లలో దుస్తులు అమ్మేవారి సందడి మొదలైంది.



ఆటోలపై సామాన్లతో వస్తున్న కూలీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ముందస్తు సంబరాలు



కె.కోటపాడులోని పాఠశాలలో భోగి వేడుక

- పాఠశాలల్లో సంక్రాంతి సందడి
- ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు



నాతవరంలో సంప్రదాయ వంటలు చేస్తున్న ఉపాధ్యాయులు

కె.కోటపాడు/నాతవరం : రంగురంగుల ముగ్గులు, హరిదాసుల పాటలు, డూడూ బసవన్నల విన్యాసాలు, నూరూరించే సంప్రదాయ వంటకాలు..మన సంస్కృతీసంప్రదాయాలను చాటిచెప్పే వస్త్రధారణలతో పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలతో బాలలు సందడి చేశారు. కె.కోటపాడులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో వేడుకల్లో పాల్గొన్నారు. భోగి మంట వేసి, మహిళలకు ముగ్గుల పోటీల నిర్వహించారు. చిన్నారుల ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. నాతవరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు, డి.యర్రవరం, ఎం.బి.పట్నం స్కూళ్లలో విద్యార్థులు ఆటలు పాటలతో సందడి చేశారు. పాఠశాలల ప్రాంగణంలో పలు సంప్రదాయ పిండివంటలు తయారు చేశారు.ఈ సందర్భంగా ఎంఈవో ఎంఈవో తాడి అమృత్ కుమార్ మాట్లాడుతూ ఆచార,సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేసే బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఏయూలో వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కార్నర్



వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కార్నర్‌ను ప్రారంభిస్తున్న వీసీ సమత, జెన్నిఫర్ హోవెల్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కార్నర్ బుధవారం ప్రారంభమైంది. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా ప్రో చాన్సలర్ జెన్నిఫర్ హోవెల్ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య కె.సమత మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది, ప్రయోగశాలలు, గ్రంథాలయం వంటి వసతులను కలిగి ఉందన్నారు. ఏయూలో 58 దేశాలకు చెందిన 1,084 మంది విదేశీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. వీరికి అవసరమైన హాస్టళ్లు, వసతులను కల్పించామన్నారు. సుందర నగరం విశాఖ పర్యాటకులకు స్వర్గధామంగా ఉందన్నారు. జెన్నిఫర్ హోవెల్ మాట్లాడుతూ విభిన్న రంగాల్లో ఏయూతో కలిసి పనిచేస్తామన్నారు. రెండు వర్సిటీలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్.. ఏయూలో నిర్వహిస్తున్న కోర్సులు, వసతులు, విదేశీ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు తదితర అంశాలను వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఏయూలో సమర్థంగా నిర్వహిస్తున్న అమెరికన్ కార్నర్ పనితీరు, నిర్వహించిన కార్యక్రమాలపై మాట్లాడారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి వర్చువల్ విధానంలో పాల్గొని రెండు వర్సిటీల ప్రతినిధులను అభినందించారు. గవర్నమెంట్ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కమిషనర్(ఇండియా–గల్ఫ్) నషీద్ చౌదరి, ఎడ్యుకేషన్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆంటోని జోసెఫ్, ఏయూ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.కె భట్టి, వి.విజయలక్ష్మి వై.రాజేంద్రప్రసాద్, ఏ.నరసింహారావు, జి.శశిభూషణరావు, ఆచార్య టి.శోభశ్రీ, గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

త్వరలో అరకు పార్లమెంట్ పరిధిలో పర్యటన

- సమన్వయకర్త నియామకంపై అభిప్రాయాలు సేకరిస్తాం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



పార్టీ విశాఖ ఉత్తర నాయకులతో సమీక్ష చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో సమన్వయకర్త కె.కె.రాజు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలుపే తమ లక్ష్యమని ఆ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో గాజువాక, విశాఖ ఉత్తర, భీమిలి, పెందుర్తి, అరకు నియోజకవర్గాల పార్టీ ముఖ్య నాయకులతో బుధవారం ఆయన సమావేశయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అరకు సమన్వయకర్త నియామకంపై అక్కడి కార్యకర్తల నుంచి కొన్ని అభిప్రాయాలు వచ్చాయన్నారు. త్వరలోనే అరకు పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తామన్నారు. అక్కడ పార్టీ శ్రేణుల అభిప్రాయాలను సేకరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి నివేదిస్తామన్నారు. నివేదిక పరిశీలన అనంతరం పార్టీ అధిష్టానం నిర్ణయం వెలువరిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల సమీక్ష

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి ఉరుకూటి చందు, విశాఖ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజుల ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో వైవీ సుబ్బారెడ్డి సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు గురించి చర్చించారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోక్, అల్లు శంకరరావు, కార్పొరేటర్లు ముత్తంశెట్టి ప్రియాంక, కంటిపాము కామేశ్వరి, కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, శశికళ, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు ఇన్‌చార్జి నీలి రవి తదితరులు పాల్గొన్నారు.

పిడకలతో భోగి మంటలు వేయండి

మద్దిలపాలెం (విశాఖ): ఆవు పేడతో తయారు చేసిన పిడకలతో సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేసుకుని మన సంస్కృతిని, పర్యావరణని కాపాడుకుందామని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యం వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు శివాజీపాలెంలోని సంఘం కార్యాలయంలో బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పిడకలను తయారు విధానాన్ని సూచనలు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లతో భోగి మంటలు వేయవద్దని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, సంఘం కార్య



దర్శి పాలెం నేచురల్స్ చవ్వాకుల అశోక్, ప్రతినిధులు మురళీధర్, సలాది కృష్ణయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి కల్పనకు దరఖాస్తు చేసుకోండి



పీఎంఈజీపీ ద్వారా మంజూరు చేసిన ఆటోలు ప్రారంభిస్తున్న ఏడీ పద్మ

పాయకరావుపేట : ఉపాధి కల్పనకు యువత ప్రధానమంత్రి ఉపాధి కల్పనకు దరఖాస్తు చేసుకోవాలని ఖాదీ విలేజ్ పరిశ్రమ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.పద్మ అన్నారు. స్థానిక అంబేద్కర్ పార్కులో కొందరు నిరుద్యోగ యువకులతో సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పన కోసం బ్యాంకుల ద్వారా ఆర్థిక సాయంతో వృత్తి పరికరాలు, ఆటోలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పీఎంఈజీపీ ద్వారా మంజూరు చేసిన ఆటోలను ప్రారంభించారు. ఆటోలు మంజూరు చేసినందుకు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్ పి.వి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఖైదీల పట్ల మానవత చూపాలి



ఖైదీకి స్టీల్‌ప్లేటు, గాసు అందిస్తున్న లక్ష్మీసుభాషిణి

అనకాపల్లి : క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీల అవసరాలను గుర్తించే బాధ్యత అందరిపై ఉందని జిల్లా ఖజానా శాఖ అధికారి వి.లక్ష్మీసుభాషిణి అన్నారు. స్థానిక సబ్‌జైలు ఆవరణలో బుధవారం జ్యోతిరావు పూలే చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో ఖైదీలకు స్టీల్‌ప్లేట్లు, గ్లాసులు ఆమె అందజేసి మాట్లాడారు. ఖైదీల పట్ల మానవతాదృక్పథం కనబర్చాలని పేర్కొన్నారు. జైలు సూపరింటెండెంట్ గణేష్‌రెడ్డి మాట్లాడుతూ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఖైదీల్లో పరివర్తనకు పాటుపడుతామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత జైలు హెడ్‌వార్డర్, సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా హిందీ కవి సమ్మేళనం

మహారాణిపేట (విశాఖ): ప్రపంచ హిందీ దినోత్సవాల్లో భాగంగా బుధవారం నగర రాజభాష కార్యాన్వయ సమితి విశాఖపట్నం ఆధ్వర్యంలో భారతీయ మత్స్య పరిశోధన సంస్థ (ఎఫ్ఎస్ఐ) కార్యాలయంలో హిందీ కవి సమ్మేళనం నిర్వహించారు. ఫిషింగ్ హార్బర్ రోడ్డులో ఉన్న భారతీయ మత్స్య పరిశోధన సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి అధ్యక్షత వహించారు.

సీఎం జగన్ పాలనలో
ప్రగతి పథంలో గ్రామాలు



శిలాఫలకం ఆవిష్కరించి కాశీపురం-సమ్మెద రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర



కాశీపురంలో సచివాలయ భవనం ప్రారంభోత్సవం

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- కాశీపురం, దేవరాపల్లిలో రూ.4.55 కోట్లతో అభివృద్ధి పనులు
- జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్రతో కలిసి డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం

దేవరాపల్లి : రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలు ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ మేరకు కాశీపురం, దేవరాపల్లి పంచాయతీల పరిధిలో రూ.4.55 కోట్లతో చేపట్టిన మూడు అభివృద్ధి పనులను ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిసి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బుధవారం ప్రారంభోత్సవం చేశారు. కాశీపురంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, కాశీపురం నుండి సమ్మెద వరకు రూ. 2.60 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను జెడ్పీ చైర్ పర్సన్ జె.సుభద్రతో కలిసి డిప్యూటీ సిఎం ముత్యాలనాయుడు శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. దేవరాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పక్క నుంచి మారేపల్లి వరకు రూ. 1.52 కోట్లతో నిర్మించిన తారురోడ్డును శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా విప్లవాత్మకమైన అభివృద్ధిని కేవలం నాలుగున్నరేళ్ల చేసి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధికి చిరునామాగా మార్చారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలతో పాటు మట్టి రోడ్లన్నింటిని తారురోడ్లుగా నిర్మించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు.

అభివృద్ధి పనులపై జెడ్పీ చైర్‌పర్సన్ హర్షం

దేవరాపల్లి మండలంలో కోట్లాది రూపాయల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధిని చూసి జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర హర్షం వ్యక్తం చేశారు. ఆధునికీకరించిన ఆర్టీసీ కాంప్లెక్స్, వుడా నిధులతో సుందరంగా తీర్చిదిద్దుతున్న పార్కు, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, గ్రామాల మధ్య నిర్మించిన తారు రోడ్లతో పాటు అధునాతన హంగులతో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీవో భవనాన్ని చూసి విశాఖనగరంలో ఉన్న మాదిరిగా భవనాలు ఉన్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి నారాయణమ్మ, మండల అధ్యక్షుడు బూరె బాబురావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ లలితానాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వి. సింహాచలంనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, సర్పంచ్‌లు సబ్బవరపు పెంటమ్మ, రామకృష్ణ, దొమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీలు కృష్ణమూర్తి, పైడితల్లమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు దాసరి గోపి, దేముడునాయుడు, మంగునాయుడు, వెంకటరావు, మహాలక్ష్మీనాయుడు, ఆర్అండ్ డీఈలు ధనుంజయ, ఫణీశ్వరరావు, ఏఈలు కృష్ణారావు, శ్రీనివాసరావు, ఎంపీడీవో సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

గిరిజనేతర రైతుల ఆందోళన తీవ్రతరం

- పెదగంగవరంలో పెట్రోల్ క్యాన్లతో, దేవరాపల్లిలో నీళ్ల ట్యాంక్ ఎక్కి నిరసన
- సంక్రాంతి తర్వాత పరిశీలిస్తామన్న డిప్యూటీ కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ



దేవరాపల్లిలో మంచినీటి ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న పెదగంగవరం రైతులు

దేవరాపల్లి/అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదగంగవరం గ్రామానికి చెందిన గిరిజనేతర రైతులు తమ భూ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమీపంలోని అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో మంచినీటి ట్యాంక్ ఎక్కి బుధవారం నిరసన చేపట్టారు. తరతరాలుగా వ్యవసాయ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న తమకు అన్ని హక్కులు ఉన్నా 1/70 చట్టం పేరుతో గిరిజన సంఘాల నాయకులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని నిరసిస్తూ పెదగంగవరంలో గత ఐదు రోజులుగా వారు నిరసన దీక్షలు చేస్తున్నారు. అధికార యంత్రాంగం స్పందించలేదంటూ బుధవారం నిరసనలను ఉధృతం చేశారు. కొందరు రైతులు పెట్రోల్ కేన్లతో పెదగంగవరం రామాలయంలో తలుపులు వేసుకొని, మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. సుమారు పది మందికి పైగా రైతులు దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో 50 అడుగుల మేర ఎత్తున్న మంచినీటి ట్యాంక్ ఎక్కి తమ భూ సమస్య పరిష్కరించకుంటే దూకి ఆత్మహత్య చేసుకుంటామంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న చోడవరం సీఐ కుమారస్వామి, దేవరాపల్లి తహసీల్దార్ ఎం.లక్ష్మి దేవరాపల్లి మంచినీటి ట్యాంక్ వద్దకు చేరుకున్నారు. చోడవరం నుంచి ఫైరింజన్‌ను రప్పించి నిరసనకారులను కిందకు దించేందుకు చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో వారంతా పెదగంగవరం చేరుకున్నారు.

రామాలయంలో ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడగా అల్లూరి జిల్లా అధికార్ల నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరసన విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. దీంతో అల్లూరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ శర్మతో ముందుగా తహసీల్దార్ మాట్లాడి ఇక్కడి ఆందోళన పరిస్థితిని వివరించారు. అనంతరం అన్నదాతలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో మాట్లాడించారు. సంక్రాంతి పండగ తర్వాత గ్రామానికి వచ్చి అన్నదాతల ఆవేదన స్వయంగా తెలుసుకొని పరిష్కారానికి చొరవ చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందిన రైతులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. దేవరాపల్లిలో ట్యాంక్‌పై నిరసన చేస్తున్న రైతులకు ఈ విషయం చెప్పడంతో వారంతా కిందికి దిగారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



కె.కోటపాడులో రసవత్తరంగా సాగుతున్న కబడ్డీ పోటీలు



మునగపాక జెడ్పీ హైస్కూల్లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



అనకాపల్లి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలో బాలికలు

మొదటి విడతలో గ్రామ/సచివాలయ స్థాయిలో అలరించిన 'ఆడుదాం ఆంధ్రా' బుధవారం మళ్లీ ప్రారంభమైంది. రెండో విడతలో మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో నెగ్గిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. ఎందరో ఔత్సాహిక క్రీడాకారులు ఈ కార్యక్రమం ద్వారా తమ ప్రతిభ నిరూపించుకుంటున్నారు.

-సాక్షి న్యూస్ నెట్‌వర్క్

వెంకన్న సన్నిధిలో కత్తిపూడి నగర సంకీర్తన బృందం



ఉపమాకలో నగర సంకీర్తన చేస్తున్న బృందం

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారిని కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన నగర సంకీర్తన బృందం సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈ బృంద సభ్యులు కత్తిపూడి, పరిసర గ్రామాల్లో ప్రతి రోజు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ధనుర్మాస విశిష్టతను ప్రచారం చేస్తున్నారు. కత్తిపూడి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గల వేణుమాధవస్వామి హరే కృష్ణ నగర సంకీర్తన బృందం బుధవారం ఉపమాక వెంకన్న ఆలయాన్ని దర్శించుకుంది. ఉపమాక మాడ వీధుల్లో హరేరామ హరే రామ రామ రామ హరే హరే హరే కృష్ణ హరే కృష్ణ , కృష్ణ కృష్ణ హరే హరే అనే సంకీర్తనతో ఊరేగింపు నిర్వహించారు. ఎనిమిదేళ్లుగా ఏటా తమ బృందం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ కాలింగ నూకరాజు తెలిపారు. ఉపమాక ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆలయ విశిష్టతలను, స్వామివారికి నిర్వహించే సేవలు, ఉత్సవాలను, భోగినాడు జరిగే గోదాదేవి కల్యాణ మహోత్సవం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్న జీలకర్ర త్రిమూర్తులు, కంద గోవిందు, కేలంగి పేర్రాజు, జీలకర్ర లక్ష్మణరావు, కందా తాతీలు, కోలా నాగు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

దేవరాపల్లి : సీతంపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి సీతంపేటలో బుధవారం దాడి చేశామన్నారు. గ్రామానికి చెందిన కొయినాన శ్రీరామమూర్తి నుంచి 20 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ నాగేంద్ర స్పష్టం చేశారు.

సారా బట్టీలపై దాడులు



సారా పులుపును స్వాధీనం చేసుకున్న ఎస్ఐ ధనుంజనాయుడు, సిబ్బంది

నర్సీపట్నం : మండలంలోని గదవపాలెం గ్రామ శివారుల్లో నిర్వహిస్తున్న సారా తయారీ బట్టీలపై రూరల్ ఎస్ఐ ధనుంజనాయుడు సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3 వేల లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే వంట పాత్రలను స్వాధీనం పరుచుకున్నారు. సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

ఆలయాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం



ఆలయం ఆవరణలో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు, చైర్మన్ నాయుడు

అనకాపల్లి : స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ,సూర్యనారాయణస్వామి దేవాలయంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు అన్నారు. బుధవారం రాత్రి రాష్ట్ర అమరావతి దేవదాయశాఖ స్థపతి శ్రీనివాసరావు సందర్శించారు. చైర్మన్ మాట్లాడుతూ దేవాలయం ఆవరణలో ఖాళీస్థలంలో వివాహాలు జరుగుతున్నాయని, వివాహ సమయంలో పెండికుమారుడు, కుమార్తెలకు కొత్తగా రెండు రూమ్‌ల నిర్మాణానికి, రెండు షాప్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆదినారాయణ, ధర్మకర్తలు మారిశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట అప్పలనాయుడు, ఎక్స్ ఆఫీషియో మెంబర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

మంగళగిరికి విశిష్ట సాహిత్య పురస్కారం



మంగళగిరి ప్రసాదరావు

మహారాణిపేట: సాహితీవేత్త మంగళగిరి ప్రసాదరావు సాహిత్య అకాడమీ తరపున విశిష్ట సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఏలూరు జిల్లాలో గురువారం జరిగే సాహిత్య సంక్రాంతి సంబరాల్లో ఈ పురస్కారం స్వీకరించాలని ఆయనకు రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిలగొల్ల శ్రీలక్ష్మి ఆహ్వానం పంపారు. ప్రసాదరావు 2017లో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ నుంచి గుర్రం జాషువా సాహిత్య పురస్కారం, 2018లో అదే సంస్థ నుంచి గిడుగు రామ్మూర్తి విశిష్ట భాషా పురస్కారం, 2019లో బుల్లయ్య కాలేజీలో ఫెలోషిప్ అవార్డు, 2019లో ఢిల్లీలో మహాత్మా జ్యోతిబా పూలే సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు.

అంబేడ్కర్ జీవిత విశేషాలపై లఘు చిత్రాల ప్రదర్శన



చిత్ర ప్రదర్శన తిలకిస్తున్న ప్రేక్షకులు

సీతంపేట: జన్ భాగీదారి పేరిట జిల్లాలో నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమాలు రెండవ రోజూ ఉత్సాహంగా సాగాయి. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవిత విశేషాలను వివరిస్తూ.. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం లఘుచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శించిన లఘు చిత్రాలు, ఛాయా చిత్రాలను ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. రెండవ రోజు పలువురు దాతలు ముందుకు రక్తదానం చేశారు. ఇక్కడ ప్రదర్శించిన లఘుచిత్రాల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఉత్తమ చిత్రానికి ముఖ్యమంత్రి చేతులమీదుగా నగదు బహుమతి అందజేయనున్నారు. డీపీవో శ్రీనివాసరావు, డీఎల్డీవో పూర్ణిమాదేవి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పికొండ తీరంలో అస్థిపంజరం కలకలం



కూర్మన్నపాలెం : దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి. అప్పికొండ సముద్ర తీరంలో బుధవారం అస్థిపంజరం లభ్యం కావడం కలకలం రేపుతుంది. పెదగంట్యాడ మండలం నమ్మిదొడ్డి సమీపంలోని అప్పికొండ సముద్ర తీరప్రాంతంలో గుర్తు తెలియని అస్థిపంజరం బయటపడడంతో అక్కడికి వచ్చిన పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకొని అస్థిపంజరాన్ని పరిశీలించారు. ఫోరెన్సిక్ పరీక్షల కోసం అస్థిపంజరాన్ని కేజీహెచ్‌కు తరలించామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వెలమ సంక్షేమ సంఘానికి స్థలం కేటాయింపు

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన సభ్యులు



సమావేశంలో పాల్గొన్న వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: వెలమ సంక్షేమ సంఘానికి ప్రభుత్వం 75 సెంట్ల భూమి కేటాయించడం పట్ల ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చుక్కా చినబాబు, కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సీతమ్మధారలోని వెలమ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వాన్ని అభినందిస్తూ తీర్మానం చేశారు. వెలమ సంఘం పెద్దలు, మంత్రులు బూడి ముత్యాలనాయుడు, ధర్మాన ప్రసాదరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థల సేకరణ కమిటీ సభ్యులు చుక్క చినబాబు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, చొక్కాకుల వెంకటరావు, యర్ర సన్యాసినాయుడు, అల్లు శంకరావు, బండారు రామకృష్ణ, మిడతాన బాపునాయుడు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు

ఆడారి ఆనంద్ పెద్ద మనసు

- దుబాయ్ నుంచి ఇందిరానగర్ వాసి మృతదేహం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు
- విమాన చార్జీలను భరించిన వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్



అప్పలస్వామి మృతదేహం

మల్కాపురం (విశాఖ): ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. పైగా ఆయన వీసా గడువు ముగిసింది. అక్కడి నుంచి మృతదేహాన్ని ఇక్కడకు తీసుకొచ్చేందుకు అతని కుటుంబ సభ్యులకు తలకుమించి భారమైంది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మానవత్వం చూపించారు. అతని మృతదేహం తీసుకొచ్చే ఏర్పాట్లు చేయడంతో పాటు అందుకయ్యే విమాన చార్జీలను భరించారు. వివరాలివీ.. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీకి చెందిన కొయ్య అప్పలస్వామి ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఇటీవల అనారోగ్యంతో అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే అతని పర్మిట్ వీసా గడువు ముగిసింది. దీంతో మృతదేహాన్ని ఇక్కడకు తీసుకురాలేని పరిస్థితి నెలకొంది. అతని కుటుంబ సభ్యులు కార్పొరేటర్ పి.వి.సురేష్, వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్ ద్వారా వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణకు ఈ విషయం చెప్పారు. ఆయన ఢిల్లీలోని ఎంబసీ అధికారులతో మాట్లాడారు. దీంతో అప్పలస్వామి మృతదేహం బుధవారం ఇక్కడకు తీసుకురాగా.. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. దుబాయ్ నుంచి మృతదేహం తీసుకొచ్చేందుకు అయిన విమాన చార్జీలను కూడా ఆడారి ఆనంద్‌కుమార్ చెల్లించి పెద్ద మనసు చాటుకున్నారు. ఆయనకు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

12న స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం మేయర్, చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఈ నెల 12న జరగనుంది. ఈ సమావేశంలో 38 అంశాలు చర్చకు రానున్నాయి. అనకాపల్లిలో జీవీఎంసీ గెస్ట్‌హౌస్, సమావేశ మందిరం, కార్యాలయ చాంబర్ డిజైన్‌కు పరిపాలన ఆమోదం , ఏఎంసీ కాలనీలో ఎఫ్ఆర్‌పీ టాయ్‌లెట్‌కు రెట్రో ఫిట్టింగ్ మరమ్మతులు, 35వ వార్డులోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం నిర్వహణ, సెక్యూరిటీ గార్డ్స్, హౌస్‌కీపింగ్ వర్కర్స్, హార్టికల్చర్ వర్కర్స్, మెటీరియల్ కొనుగోలు, కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు సీ అండ్ డీ వ్యర్థాలు, గార్బేజ్, ట్రీ వేస్ట్‌ను 12 సీఎంటీ టిప్పర్ల ద్వారా తరలింపు తదితర అభివృద్ధి అంశాలు, ఉద్యోగుల సర్వీస్ అంశాలు సభ్యుల ముందు చర్చకు రానున్నాయి.

క్లుప్తంగా

విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తు చూపిస్తున్న తట్టా పెంటయ్యనాయుడు

అనకాపల్లి: సంప్రదాయ చేతివృత్తిదారులకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ఎంతగానో ఉపకరిస్తుందని తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కులవృత్తులు, స్కిల్ డెవలప్‌మెంట్ పెట్టుబడి, మార్కెటింగ్ అవకాశాలు వృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం 15 రోజులపాటు శిక్షణ ఇస్తారన్నారు. వృత్తి కార్మికులకు శిక్షణ కేంద్రం ద్వారా రోజుకు కేంద్ర ప్రభుత్వం రూ.500 అందజేస్తారన్నారు. ఓబీసీ సీనియర్ నాయకుడు పీలా మురళి, అధికసంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆఖరి గురువారం పూజలకు ఏర్పాట్లు

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఆఖరి గురువారం పూజలకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్ తెలిపారు. మార్గశిర మాసోత్సవాల ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగినట్లుగా సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

సామాజిక భవనాన్ని కూల్చేసి.. అక్రమ నిర్మాణం

తుమ్మపాల: అనకాపల్లి మండలం శంకరం పంచాయతీ పరిధిలో రాయుడుపేట కాలనీకి గల ఒక్కగానొక్క సామాజిక భవనాన్ని కొందరు వ్యక్తులు కూల్చేశారు. గత కొంత కాలంగా శిథిలావస్థలో ఉన్న ఈ భవనంలో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకుండా అధికారులు వదిలేశారు. ఈ కాలనీల్లోని 30 ఇళ్లకు తాగునీటి కొరత లేకుండా ఈ భవనంపై ట్యాంక్ ఏర్పాటు చేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు ఈ భవనంతోపాటు చుట్టుపక్కల కొన్ని గృహాలు సైతం నీటి ముంపునకు గురవ్వడంతో అదే అదునుగా కొందరు వ్యక్తులు సామాజిక భవనాన్ని కూల్చేసి శిథిలాలపై గ్రావెల్ వేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి పలు మార్లు హెచ్చరించినా.. పట్టించుకోకపోవడంతో నోటీసులు జారీ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	:	రాజా
కపాలదీవి	:	సత్యనారాయణస్క్రీన్-1
దీనమ్మ జీవితం	:	సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	:	షిర్డిసాయి
సలార్	:	పర్తిసాయి
రాఘవరెడ్డి	:	వెంకటేశ్వర
తికమక తాండ	:	శ్రీసత్య
సలార్	:	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 6,706 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,960	4,230
మొదటి రకం	3,700	4,090
రెండో రకం	3,630	3,900
మూడోరకం	3,410	3,620

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 23 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 9703619706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 433 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 426 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఆసక్తికరంగా 'ఆడుదాం ఆంధ్రా'



కశింకోట హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



కశింకోట మండల స్థాయి కార్యాలయం వద్ద బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి

- మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం
- 20 సచివాలయాల నుంచి పాల్గొన్న జట్లు

కశింకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు వేర్వేరు చోట్ల జరిగే ఈ పోటీలను ఎంపీపీ కలగా లక్ష్మి ప్రారంభించారు. స్థానిక బాలికల హైస్కూల్‌లో వాలీబాల్, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. 20 సచివాలయాల నుంచి బాలబాలికల జట్లు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నాయి. వాలీబాల్, బ్యాడ్మింటన్ జట్లు సెమీ ఫైనల్, ఫైనల్‌కు చేరాయి. గురువారం వీరికి పోటీలు నిర్వహించనున్నారు.

ఈ నెల 12న కశింకోటలో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు పీడీలు వి.ప్రభాకరరావు, పెంటకోట కమల తెలిపారు. ఈ పోటీలను ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఎంఈవో మూర్తి పర్యవేక్షించారు. సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు

మండలంలోని బయ్యవరం హైస్కూల్‌లో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు వీటిని ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు గొన్నా వెంకట సత్యనారాయణ, పీడీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నూతలగుంటపాలెంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా ఆడారు. మండలం నుంచి సుమారు 70 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు కలిగెట్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బయ్యవరంలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు



కశింకోట హైస్కూల్‌లో వాలీబాల్ ఆడుతున్న యువతులు

ఎంతో ఆనందంగా ఉంది



ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొని ఆడటం ఎంతో ఆనందంగా ఉంది. సచివాలయ స్థాయిలో గెలిచి మండల స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాం. ఇక్కడ గెలిచి ఫైనల్‌కు చేరాం. గురువారం జరిగే ఫైనల్ కూడా విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాగలమన్న విశ్వాసం ఉంది.

– కంఠపురెడ్డి కిషోర్, నరసింగబిల్లి

క్రీడాకారులకు మేలు



ఆడుదాం ఆంధ్రా ఆటలు పోటీలు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ప్రతిభావంతులను వెలికి తీయడానికి దోహదపడతాయి. నాకు వాలీబాల్ అంటే ఆసక్తి. సచివాలయ స్థాయిలో పాల్గొని మండల స్థాయి పోటీలకు ఎంపికయ్యాం. వీటిలో కూడా విజయం సాధించి ఉన్నత స్థాయికి చేరుకోగలమని ఆశిస్తున్నాం.

– నల్లం పవన్‌కుమార్, చింతలపాలెం

గ్రామీణ క్రీడాకారులకు వరం



తుమ్మపాలలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో బ్యాటింగ్ చేస్తున్న కార్పొరేటర్ సునీత

అనకాపల్లి: గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు దోహదపడతాయని 82, 83 వార్డుల కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో బుధవారం మండల స్థాయి క్రికెట్ పోటీలను వారు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారులు పోటీల్లో మంచి నైపుణ్యం కనబర్చాలని సూచించారు.

అంతకుముందు కార్పొరేటర్ సునీత బ్యాటింగ్ చేయగా.. మరో కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి బౌలింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని కలిగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జెడ్పీ ఎస్.వెంకటరమణ, పార్టీ యువజన విభాగ పట్టణ అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, క్రీడాకారులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

క్రీడలకు పుట్టినిల్లు అనకాపల్లి

పట్టణంలోని డీసీఎంఎస్ ఆవరణలో ఖోఖో, రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. మండలంలోని తుమ్మపాల ఖోఖో మైదానంలో ఖోఖో, క్రికెట్ పోటీలను ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలకు అనకాపల్లి పుట్టినిల్లు అన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలు దోహదపర్చుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం నలుమూలల ఉన్న క్రీడాకారులను జాతీయ స్థాయి క్రీడల్లో చూసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, ఏపీఐబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ ఎంపీడీవో కె.వి.నర్సింహారావు, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, క్రీడాకారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



బౌలింగ్ చేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



డీసీఎంఎస్ మైదానంలో ఖోఖో ఆటలో క్రీడాకారులు



తుమ్మపాల క్రీడా మైదానంలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

కళాశాలకు పూర్వ విద్యార్థి వితరణ

అనకాపల్లి: కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల అభివృద్ధి పనుల నిమిత్తం పూర్వ విద్యార్థి కేవీవీ అనూజ్ రూ.20 వేలు అందజేశారు. ప్రిన్సిపాల్ గెల్లా జయబాబుకు విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. కళాశాలలో నిర్మాణంలో ఉన్న సోలార్ యూనిట్, డైనింగ్ షెడ్‌కు ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారం అందించడం అభినందనీయమన్నారు. అంతకుముందు అనూజ్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పూర్వ విద్యార్థులు అందించిన కంప్యూటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన జేఏసీ నాయకుడు ఆడారి కిశోర్‌కుమార్, కళాశాల యాజమాన్య కమిటీ సభ్యుడు వాసిరెడ్డి బాలకృష్ణ, పర్యవేక్షకురాలు పెంటకోట అనురాధ, పద్మనాభుని రాజేశ్వర ప్రసాద్, కోరిబిల్లి లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్లు పరిశీలిస్తున్న కళాశాల యాజమాన్య కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు



రోగికి మందులు, కేస్ షీట్ అందిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

- 200మందికి వైద్యసేవలు

అనకాపల్లి: రాష్ట్రంలో ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక లక్ష్మీదేవిపేట ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి వద్దకే వైద్యసేవలు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమం చేపట్టలేదని తెలిపారు. వైద్యశిబిరంలో జనరల్ ఫిజీషియన్‌తో పాటు వైద్యనిపుణులు రోగులను పరిశీలించారు. శిబిరంలో 200మందికి పరీక్షలు నిర్వహించగా, వివిధ వ్యాధులతో బాధపడుతున్న 5గురిని స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో జెడ్పీ సుర వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, ప్రధాన కార్యదర్శి కారుకుండి కన్నబాబు, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అంటాకుల రత్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



భగభగలాడే భోగిమంటలు.. రంగుల రంగవల్లికలు.. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థుల సందడితో స్థానిక మెయిన్‌రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ కళకళలాడింది. భోగిమంటల వద్ద విద్యార్థుల నృత్యాలు ఉత్సాహాన్ని నింపాయి. పల్లెను ప్రతిబింబించేలా సెట్ వేసి, బసవన్నకు మహిళ పూజ చేసేలా తీర్చిదిద్దిన నమూనా ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

– అనకాపల్లి



ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

11 మంది బైండోవర్

కశింకోట: మండలంలోని మద్యం తయారీ, అమ్మకాలు తదితర కేసులతో సంబంధం ఉన్న 11 మందిని బుధవారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ శ్రావణి తెలిపారు. ఇకపై ఎటువంటి నేరాలకు పాల్పడబోమని బైండోవర్ చేస్తూ తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు ముందు హాజరు పరిచినట్లు చెప్పారు.

న్యాయవాదుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తుమ్మపాల: నూతన భూమి హక్కు చట్టం రైతులకు, స్థిరాస్తుల యజమానులకు అశనిపాతమని న్యాయవాదులు అన్నారు. తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేయాలని అనకాపల్లి బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం వారు నిరసన తెలిపారు. పట్టణంలో కోర్టు కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీగా వెళ్లి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వినతి పత్రం అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్ మంత్రి సాయి లక్ష్మణ్, సెక్రటరీ సూర్యశ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

డీసీసీబీ సేవలపై విస్తృత ప్రచారం



ఇంటింటా అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ సీఈవో వర్మ

కశింకోట: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని విశాఖ డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్. వర్మ కోరారు. కశింకోటలో బుధవారం 'ఇంటింటికీ డీసీసీబీ' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలు, ఇళ్లకు వెళ్లి డీసీసీబీ సేవలను వివరించారు. బ్యాంకు విశాఖ డీజీఎం, నోడల్ ఆఫీసర్ ఎం.అశోక్‌కుమార్, ఏజీఎం ఎం. శ్రీనివాసరావు, అనకాపల్లి శాఖ మేనేజర్ ఎం.రజని, ఫీల్డ్ ఆఫీసర్ దాడి ప్రసాద్, నర్సీపట్నం శాఖ మేనేజర్లు ఎస్.భరణికుమార్, పి.వి.సత్యనారాయణ, కశింకోట, నరసింగబిల్లి పీఏసీఎస్‌ల సీఈవోలు ద్వారపురెడ్డి నూకేష్, నక్కా అచ్చింనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికా సాధికారతే ఎన్టీపీసీ లక్ష్యం



బాలికలకు యోగా కిట్లు అందజేస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా



బాలికలతో ప్రాజెక్టు హెడ్ సిన్హా ఉన్నతాధికారులు

- ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ: బాలిక సాధికారతే లక్ష్యంగా సింహాద్రి ఎన్టీపీసీ కృషి చేస్తుందని సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా చెప్పారు. దీపాంజలినగర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బాలికా సాధికారత మిషన్ వర్క్‌షాపును బుధవారం ప్రాజెక్టు హెడ్ సిన్హా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలు, యువతను నాయకులుగా తయారు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. తొలుత మండలంలోని 13 పాఠశాలలకు చెందిన 110 విద్యార్థులతో మిషన్ ప్రారంభమైందన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడి నేతృత్వంలో బాలికలకు స్వీయ విలువ, విశ్వాసంపై అవగాహన కల్పించడం జరిగిందని చెప్పారు. ఆధునిక ప్రపంచంలో సవాళ్లను ఎదుర్కొనే విధంగా బాలికలకు నైపుణ్యం కల్పించడమే సంస్థ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న బాలికలకు యోగా మ్యాట్‌లు, స్టేషనరీ వస్తువులతో కూడిన కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జీఎం నోవాహు గడ్డం, హెచ్‌ఆర్ హెడ్ బీబీపాత్ర, బాల భారతి పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ బి.పద్మజ, హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, సీఎస్సార్ హెచ్‌ఆర్ శివప్రతాప్‌సింగ్, దీపిక లేడీస్ క్లబ్ సభ్యులు, బాలికలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనకు యువత కృషి



సమావేశంలో మాట్లాడుతున్న శచీదేవి

అనకాపల్లి: వికసిత్ భారత్ లక్ష్యసాధనకు యువత కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి సూచించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గౌరీ గ్రంథాలయంలో వికసిత్ భారత్ 2047 పై డిబేట్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్నారు. దృక్పథం, ఆర్థికవృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, సుపరిపాలన లక్ష్యాలుగా వికసిత్ భారత్ ఏ 2047 వాయిస్ ఆఫ్ యూత్ నినాదంతో ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వ్యక్తిత్వ వికాసంలో విద్యా సంస్థల పాత్ర కీలకమన్నారు. నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా, వ్యవసాయంలో తక్కువ రసాయనాలను ఉపయోగించడం ద్వారా సహజ వనరుల సంరక్షణకు దోహదపడాలని కోరారు. ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి గొర్లి మహేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛతా అభియాన్‌కు కొత్తశక్తిని అందించడం, జీవనశైలి సమస్యలతో పోరాడడం, యువత మొబైల్‌ఫోన్‌లకు మించిన ప్రపంచాన్ని అన్వేషించాలని సూచించారు. పోటీల్లో ప్రథమ స్థానాన్ని వి.లాస్యప్రియ సొంతం చేసుకోగా ద్వితీయ, తృతీయస్థానాలను పి.దివ్యశ్రీ, ఐవీ.శ్రీవైష్ణవి దక్కించుకున్నారు. విజేతలకు పీడీ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, గ్రంథాలయ మాజీ కార్యదర్శి మళ్ల బాపు నాయుడు, సభ్యులు మారిశెట్టి శివరామకృష్ణ, బొడ్డేడ జగ్గ అప్పారావు, డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.వరప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 46వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. మురళీధర్ మాట్లాడుతూ కళాశాల 1977వ సంవత్సరంలో ఏర్పాటు అయిందన్నారు. జనరల్ కోర్సులు-4, మూడు ఒకేషనల్ కోర్సులతో ప్రారంభమై నేడు ఒకేషనల్ 9 కోర్సులు, జనరల్ కోర్సులు-4 తో మొత్తం 13 కోర్సులతో విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్య అందిస్తుందన్నారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

12న ప్రత్యేక పూజలు

పరవాడ: ఫార్మాసిటీ కాలనీలో కొండపై కొలువుదీరిన శ్రీ భూసమేత అభయ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రతంలో భాగంగా ఈ నెల 12న ఉదయం 6 గంటలకు గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 10 గంటలకు అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తామని పేర్కొన్నారు.

14న గోదా కల్యాణం

ఈ నెల 14న శ్రీగోదాదేవి, శ్రీ రంగనాథస్వామికి కల్యాణం (గోదా కల్యాణం) వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

నిర్భయంగా ఓటు వేయండి



ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

కశింకోట: ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్డీవో చిన్నికృష్ణ సూచించారు. మండలంలోని ఏఎస్ పేటలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ కార్మికులకు ఓటు హక్కు వినియోగంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ భద్రత కల్పించి అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. కార్మికులతో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు, రామ్‌కో సిమెంట్ పరిశ్రమల సీనియర్ జనరల్ మేనేజర్ వీరపాండ్యన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.కళాధరరావు, ఎన్నికల సెక్టర్ ఆఫీసర్లు ఎం.స్వప్న(మండల వ్యవసాయ అధికారి), పావని(ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ) తదితరులు పాల్గొన్నారు.